387 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● కలెక్టర్ రాహుల్ రాజ్


మాట్లాడుతున్న రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సొసైటీ, ఐకేపీ, మార్కెటింగ్ శాఖల ద్వారా 387 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సన్నరకం వరి 44,534 హెక్టార్లలో, దొడ్డు రకం 57,432 హెక్టార్లలో సాగు చేసినట్లు పేర్కొన్నారు. నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలుకు వచ్చే అవకాశం ఉందని, ఈనెల మూడో వారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 109 రైస్‌మిల్లులకు గాను 66 మిల్లులను బ్లాక్‌లిస్టులో పెట్టామని.. 43 మిల్లులకు మాత్రమే 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామన్నారు. ఇతర జిల్లాలకు 2.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలిస్తామన్నారు. రవాణాకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు: రైతుకు భరోసా కల్పిస్తూ మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని.. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని తాలు లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకొని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ కేంద్రాలకు తరలించాలని సూచించారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్తు వసతి కల్పించాలని.. టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలుంటే టోల్ ఫ్రీ నం. 92811-03685కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరికృష్ణ, అధికారి సురేష్ రెడ్డి, తూనికలు, కొలతల శాఖ అధికారి సుధాకర్, డీసీవో కరుణ పాల్గొన్నారు.

సెలవుల్లో అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ


ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: దసరా సెలవుల్లో స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇంట్లో ఉన్న బంగారు నగలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని, విలువైన వస్తువులు స్కూటర్ డిక్కీల్లో, కార్లలో పెట్టవద్దన్నారు. బీరువా తాళాలను వెంట తీసుకెళ్లాలని, విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పవద్దన్నారు. ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలని, పోలీస్ స్టేషన్ అధికారి ఫోన్ నంబరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా షీటీంలు గత నెలలో తూప్రాన్ సబ్ డివిజన్‌లో 9 మందిని, మెదక్ సబ్‌డివిజన్‌లో 12 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. 115 హాట్‌స్పాట్‌లు ఉండగా, వాటిని 147 సార్లు బృందాలు సందర్శించి 11 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. https://qr.tspolice.gov.in లింక్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

విరుల సిరులు.. ఆత్మీయతల సెలయేరు



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ. తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకొనే ఈ వేడుకలు ఉమ్మడి మెదక్ జిల్లాలో మరింత ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పండగ వచ్చిందంటే ఆడపిల్లల ఎక్కడ లేని సంబరం. ఆడపడుచుల ఆత్మీయతకు వేదికగా నిలుస్తుంది బతుకమ్మ సంబరం. నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు జిల్లాల్లోని ప్రత్యేకతలపై కథనం.

వీడని బంధం



హుస్నాబాద్ గ్రామీణం: బతుకమ్మ వేడుకలు ఎక్కడికక్కడ చేసుకోవడం కనిపిస్తుంది. అలాంటిది ఇక్కడ మాత్రం రెండు ఊర్లు కలిసి జరుపుకోవడం విశేషం. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ తోటపల్లిలో కలిసి ఉండేది. 1995లో గాంధీనగర్ ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. అయినా పాత సంప్రదాయాన్ని వీడలేదు. ఇప్పటికీ కలిసే పండగ నిర్వహించుకుంటున్నారు. 29 ఏళ్లుగా కలిసి బతుకమ్మ ఆడుతుండటం విశేషం. మిత్రులు, బంధువులు కలుసుకుంటారు.

అక్కడి వారైనా..



జిన్నారం: బతుకమ్మ తెలంగాణకు ప్రత్యేక పండగ. అలాంటి వేడుకలను జిన్నారం పారిశ్రామిక ప్రాంతంలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు కలిసి చేసుకోవడం కనిపిస్తుంది. ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మిక కుటుంబాలు వేడుకల్లో భాగస్వాములు అవుతున్నారు. ఐడీఏ బొల్లారంలోని కేబీఆర్, వైఎస్‌ఆర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో ఈ వేడుక సంబరంగా కనిపిస్తుంది. నవరాత్రుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయి. ఆయా ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేస్తుంటాయి.

ఆనవాయితీగా ఇక్కడే..



మెదక్ అర్బన్: మెదక్‌లో బతుకమ్మ సంబరాలనగానే ముందుగా గుర్తుకొచ్చేది కోదండ రామాలయమే. పట్టణంలోని కాలనీలు, కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడుతారు. అనంతరం కోదండ రామాలయానికి తీసుకురావడం ఆనవాయితీ. ఇక్కడికొచ్చాకే నిమజ్జనం చేస్తారు. ఏ వీధిలో చూసినా బతుకమ్మలన్నీ చేరే వేదిక మెదక్ కోదండ రామాలయం.

సిద్దిపేటలో కోలాహలంగా..



సిద్దిపేట: సిద్దిపేటలో బతుకమ్మ వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. తొమ్మిది రోజులు కూడళ్లు సందడిని పంచుతాయి. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అత్యంత కనులపండువగా జరిగేది ఇక్కడే. వివిధ పూలతో బతుకమ్మలు పేర్చడం మొదలు.. మహిళలు ప్రత్యేక అలంకరణతో వైవిధ్యాన్ని చాటుతారు. దారులన్నీ స్థానిక కోమటిచెరువు వైపే. సాంస్కృతిక కార్యక్రమాలు వైభవాన్ని చాటుతాయి.

సమకాలీన అంశాలపై..

ఎర్రం అవంతి, రామాయంపేట



బతుకమ్మ అంటేనే తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దం. దీని ద్వారా సందేశం ఇచ్చేందుకు యత్నిస్తున్నా. పదేళ్లుగా సమకాలీన అంశాల ఆధారంగా బతుకమ్మను తీర్చిదిద్దుతున్నా. పూలనే దేవతగా పూజించడం మనకే చెల్లింది. మహిళలపై అత్యాచారాలు నేపథ్యంలో పలు చట్టాలను తెలియజేస్తూ, కరోనా సమయంలో మాస్కు తప్పనిసరని, ట్రాఫిక్ నిబంధనలు, చంద్రయాన్ 3 వంటి బతుకమ్మలను ప్రత్యేకంగా తయారుచేశాను.

- న్యూస్‌టుడే, రామాయంపేట

విశిష్టత తెలిసేలా..



పాపన్నపేట: బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు తెలియజేసే ఉద్దేశంతో రెండో తరగతి తెలుగులో పాఠం రూపంలో పొందుపర్చారు. పూలు సేకరించినప్పటి నుంచి నిమజ్జనం చేసే వరకు వివరించారు. రంగురంగుల పూలు, బతుకమ్మ పేరుద్దాం, బతుకమ్మ ఆడుదాం, బతుకమ్మలెత్తుదాం, పోయిరా గౌరమ్మ అంటూ ఐదు గేయాలను పొందుపరిచారు.

ఆలయానికి వరద.. ఆగిన అమ్మవారి దర్శనాలు..


ఆలయం ముందు వరద ప్రవాహం



పాపన్నపేట: సింగూరు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద వరద ప్రవాహం మళ్లీ పెరిగింది. మంగళవారం తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. రాజగోపురంలో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించారు.

రేపటి నుంచి దేవీ నవరాత్రులు


మెదక్ రూరల్: మండలంలోని పేరూర్ మంజీరా నది(గరుడ గంగా) సరస్వతీ మాత ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. అమ్మవారు 12వ తేదీ వరకు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనుందని ఆలయ పూజారి రాజమౌళి శర్మ తెలిపారు. 3న బాల, 4న కౌమారి, 5న గాయత్రి, 6న అన్నపూర్ణ, 7న లలిత, 8న మహాలక్ష్మి, 9న మహా సరస్వతీ, 10న దుర్గా, 11న మహిషాసుర మర్దిని, 12 రాజరాజేశ్వరీ రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనుందని చెప్పారు.

ఆర్ఆర్ఆర్ భూమి విస్తీర్ణంలో పొరపాట్లపై ఫిర్యాదు


శివ్వంపేట తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం కొత్తపల్లి గ్రామంలో ఆర్ఆర్ఆర్ కోసం రైతులకు ఇచ్చిన నోటీసుల్లో భూ విస్తీర్ణం వ్యత్యాసం ఉండడంతో నోటీసులు తీసుకొనేందుకు నిరాకరించారు. ఈనెల 7న నర్సాపూర్‌లో నిర్వహించే ఆర్డీవో సమావేశానికి హాజరుకావాలని అధికారులు కోరడంతో రైతులంతా తిరస్కరించారు. గ్రామంలోనే చర్చించాలని, సర్వే పకడ్బందీగా చేపట్టి.. భూ విస్తీర్ణంలో పొరపాట్లు సరిదిద్దాలని నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, శివ్వంపేట తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం ఇచ్చినట్లు రైతులు తెలిపారు.

గోటిపై బాపూజీ చిత్రం



పెద్దశంకరంపేట: మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా స్వర్ణకారుడు అవుసుల శ్రీనివాసచారి సూక్ష్మ రూపంలో బాపూజీ చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. తన చేతి గోటిపై గాంధీ, మువ్వన్నెల జెండాల చిత్రాలను గీసి ఆకట్టుకున్నాడు.

కోమటికుంటలో చెత్త తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన


కోమటికుంటలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ పట్టణంలో పారిశుద్ధ్యం లోపించిన తీరుపై కొరవడిన 'చెత్త శుద్ధి' శీర్షికన 'ఈనాడు'లో గత నెల7వ తేదీన ఇచ్చిన కథనానికి పురపాలిక అధికారులు స్పందించారు. ఈమేరకు తూప్రాన్ మార్గంలోని కోమటికుంటలో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. పుర అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావులు కుంటను సందర్శించి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో తొలగింపజేశారు.

తీరొక్క పూలతో బతుకమ్మ


మెదక్ పట్టణంలోని పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలను మంగళవారం జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. పెద్దఎత్తున బతుకమ్మలను పేర్చి.. వాటిని పాఠశాలల్లోని మైదానాల్లో పెట్టి.. అంతా కలిసి ఆడిపాడారు.

కొలువుదీరనున్న దుర్గమ్మ



మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల్లో దుర్గాదేవిని మండపాల్లో కొలువుదీర్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విజయదశమి నేపథ్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి నవరాత్రి వేడుకలు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో అమ్మవారి ప్రతిమలు సిద్ధమయ్యాయి. పలు రూపాల్లో ఉన్న దుర్గాదేవి విగ్రహాలు వివిధ అడుగుల్లో ఉండగా.. స్థాయికి తగిన ధరలో కొనుగోలు చేసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

కనిపించని క్రీడా పరికరాలు

పంపిణీ చేసినా ప్రయోజనం సున్నా

న్యూస్‌టుడే, చేగుంట: పల్లెల్లో ఉన్న క్రీడా రత్నాలను వెలికితీసేందుకు గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఆడేందుకు పరికరాలను కూడా అందజేసింది. కానీ ప్రస్తుతం ఎక్కడ కూడా ఆట పరికరాలు కనిపించడంలేదు. పంపిణీ చేసిన సమయంలో కనిపించిన పరికరాలు తర్వాత ఎటు పోయాయో తెలియని పరిస్థితి ఉంది.

నిరుపయోగంగా మారి..

జిల్లాలో 469 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉండగా.. భూమి లేక పాఠశాలల ఆవరణతో పాటు చిన్న స్థలాల్లో ఏర్పాటు చేశారు. వీటి కోసం రూ.వేలు ఖర్చు చేశారు. వాస్తవానికి ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో ఏర్పాటు చేసి వాటిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు వ్యాయామం చేసేందుకు వీలుగా ఇనుప రాడ్లతో బార్‌లను ఏర్పాటు చేయాలి. కానీ చాలా చోట్ల వ్యాయామం చేసేందుకు బార్‌లను, వాలీబాల్ నెట్ కట్టేందుకు వీలుగా ఇనుప పైపులు పాతి వదిలేశారు. ఎక్కడ కూడా ఇవి వినియోగంలో లేవు. ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో పనికిరాకుండా ఉన్నాయి. ఇప్పటి వరకు వాటిలో ఆటలు ఆడిన దాఖలాలు లేవు.

ఒక్కో కిట్ రూ.18 వేలు

క్రీడా ప్రాంగణాల్లో ఆటలు ఆడేందుకు గత ప్రభుత్వం పరికరాలను ప్రతి మండల పరిషత్ కార్యాలయాలకు సరఫరా చేసింది. వాటిని 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సరఫరా చేశారు. ప్రతి చోట సర్పంచులకు అప్పగించారు. కొన్నిచోట్ల సర్పంచులు, యువకులకు కలిపి అందజేశారు. వాటిని తీసుకెళ్లి ఎక్కడ ఉంచారో కూడా తెలియదు. ప్రస్తుతం ఎక్కడ కూడా కిట్ల జాడ కనిపించని పరిస్థితి. ఎన్నికల సమయంలో కావటంతో వాటి గురించి ఎవరూ శ్రద్ధ చూపించలేదు. దీంతో విలువైన వస్తువులు కనిపించడం లేదు. ఒక్కో కిట్‌కు రూ.18 వేలు ఖర్చు చేశారు.

కిట్‌లో ఉన్న ఆటవస్తువులు

క్రికెట్ బ్యాట్లు: 2 , గ్లౌజ్‌లు: 2
వికెట్ కీపింగ్ గ్లౌజ్: 1, బాల్‌లు: 6
సింథటిక్ వాలీబాల్‌లు: 4, వాలీబాల్ నెట్‌లు: 2
సైకిల్ పంపు: 1, డిస్కస్ త్రోలు: 2
టెన్నికాయిట్ రింగ్‌లు: 6, డంబెల్స్: 3
స్కిప్పింగ్ రోప్స్: 4, స్టాప్‌వాచ్: 1
ప్లాస్టిక్ విజిల్స్: 3, క్రీడాకారుల టీషర్ట్స్: 75


గతంలో మండల పరిషత్ కార్యాలయాలకు వచ్చిన క్రీడా పరికరాలు

పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవాలని ఆందోళన

మెదక్, న్యూస్‌టుడే: మనోహరాబాద్ మండలంలోని రంగాయిపల్లి గ్రామంలో పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట గ్రామస్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చందుగౌడ్, వెంకటేష్, ప్రసాద్, మహేష్ మాట్లాడుతూ.. గ్రామానికి అనుకొని ఓ పరిశ్రమ ఉండటంతో ఇల్లు కూలిపోవడం, బోరు మోటర్లు చెడిపోవడం, విషజ్వరాలు, దద్దుర్లు తదితర వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల్లో పంటలు పండక నాలుగైదు సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.


శిథిలావస్థకు చేరిన భవనం


స్లాబ్‌కే పరిమితమై..

ఇందులో ఉండలేరు.. అందులోకి వెళ్లలేరు

రామాయంపేట తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే భవనం అంతా లీకేజీలతో దస్త్రాలు తడిసిపోతున్నాయి. ఈ దుస్థితి నుంచి బయట పడేందుకు ఆరేళ్ల కిందట రూ.కోటితో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా, పనులు స్లాబ్‌కే పరిమితమయ్యాయి. విధిలేక శిథిల భవనంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వివిధ పనుల కోసం వచ్చే వారు వర్షం కురిస్తే ఆరుబయటే నిలబడాల్సిన పరిస్థితి. కనీసం శౌచాలయాలు కూడా లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి భవనం పూర్తి చేస్తేనే ఇబ్బందులు తీరనున్నాయి. - న్యూస్‌టుడే, రామాయంపేట

రైస్‌మిల్లర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వీరేశం



మెదక్, న్యూస్‌టుడే: రాష్ట్ర రైస్‌మిల్లర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా మెదక్ పట్టణానికి చెందిన వీరేశం ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

సర్దన యువకుడికి రెండు ఉద్యోగాలు


వెంకట కృష్ణ

హవేలిఘనపూర్: సర్దనకు చెందిన శెగ్గరి వెంకటకృష్ణ గౌడ్ పీఈటీ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు రాగా, పీడీ విభాగంలో జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. శెగ్గరి పండరి గౌడ్, అనసూయల కుమారుడు వెంకట కృష్ణగౌడ్‌ది వ్యవసాయ కుటుంబం. 2018 డీఎస్సీలో 1.5మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు.

నిఘా లేని ఆలయాలే లక్ష్యంగా చోరీలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: నిఘా లేని ఆలయాలే లక్ష్యంగా చోరీలు జరుగుతున్నాయని శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఎచ్చెర్ల పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన వివిధ కేసుల్లో అయిదుగురు నిందితులను అరెస్టు చేశారు. శ్రీకాకుళంలో మంగళవారం కేసు వివరాలను వెల్లడించారు. నిందితులు 2021-24 మధ్యకాలంలో 32 ఆలయాలు, 3 బియ్యం మిల్లులు, నాలుగు ఇళ్లలో చోరీలు చేశారన్నారు. విశాఖ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, మెదక్ జిల్లాలోనూ నేరాలకు పాల్పడినట్లు చెప్పారు. మొత్తం 43 నేరాల్లో నిందితులుగా వీరికి గుర్తించామన్నారు. వారి నుంచి సుమారు రూ.91.38 లక్షల విలువైన 692 గ్రాముల బంగారం, 52.880 గ్రాములు వెండి ఆభరణాలు రూ.3.38,570, నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు కట్టర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు సీసీ కెమెరాలు లేని ఆలయాలపై దృష్టి సారించి దొంగతనాలు చేస్తున్నారని, సీసీ కెమెరాలుంటే డీవీఆర్‌లు ఎత్తుకుపోయి నీటిలో పడేస్తుంటారన్నారు.

రాయితీతో సాగు.. లాభాలు బాగు

ఆయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహకం


చల్మెడ నర్సరీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రతాప్‌సింగ్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు. అటవీ జంతువులు, కోతుల వల్ల కూడా ముప్పు ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా దీని సాగుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. సాగు విస్తీర్ణం పెంచేందుకు 60-40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి రైతులకు ప్రోత్సాహకాలు, రాయితీలు అందజేస్తున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' కథనం..

పలు ప్రోత్సాహకాలు....

ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 90 శాతం రాయితీతో ప్రభుత్వమే మొక్కలు అందజేస్తుంది. దీనితోపాటు 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు బిందు సేద్యంపై బీసీ రైతులకు 90శాతం, 5-12.50 ఎకరాల వరకు ఉన్న వారికి 80శాతం, ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై పరికరాలను అందజేయనున్నారు. అంతర్గత పంటలకు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇలా సాగు చేసుకుంటే ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున నాలుగు ఏళ్ల వరకు ప్రభుత్వం రాయితీ అందజేయనుంది.

నాలుగేళ్లకు లబ్ధి

సాగు చేసిన మొదటి సంవత్సరం ప్రభుత్వం నుంచి మొక్కలకు రూ.9650, బిందు సేద్యం పైన రూ.19500, అంతర్గత పంటలు సాగు చేసినందుకు రూ.4200తో కలిపి ఎకరాకు రూ.33,350 చెల్లిస్తుంది. రెండు నుంచి నాల్గో సంవత్సరం వరకు ఏటా రూ.4,200 చొప్పున మొత్తం రూ.12,600తో కలిపి మొత్తం నాలుగేళ్లు ఎకరానికి రూ.45,950 రాయితీ అందజేస్తుంది.

ఎకరానికి రూ.1.76లక్షల ఆదాయం...

సాగు చేసిన మూడో సంవత్సరం నుంచి ఎకరాకు 3-4 టన్నులు, 4-35 సంవత్సరాల వరకు 10-16 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం టన్నుకు రూ.14,700 ఉండగా, సాధారణంగా ఎకరానికి 12 టన్నుల దిగుబడి చొప్పున రూ.1,76,400 ఆదాయం ఆర్జించవచ్చు. నాలుగేళ్ల తర్వాత అంతర్గత పంటల స్థానంలో చాక్లెట్ల తయారీకి సంబంధించిన కొకొవా పంటలను సాగు చేసుకోవచ్చు. ఇవి నాటిన సంవత్సరం నుంచే దిగుబడి వస్తుంది. వీటి ద్వారా ఎకరాకు రూ.70వేల వరకు అదనపు ఆదాయం రానుంది.

35 ఏళ్ల వరకు పంట

జిల్లాలో ఈ సంవత్సరానికి 1174 ఎకరాల్లో పంట సాగు చేసేందుకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒక్కసారి నాటితే 35 ఏళ్ల వరకు పంట వస్తుంది. మరిన్ని వివరాలకు నర్సాపూర్ ఉద్యానవన శాఖ అధికారి సంతోష్ చరవాణి నం.8977714422, మెదక్ ఉద్యానవన శాఖ అధికారిణి రచన నం.8977714423, కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ నం.7063402404కు సంప్రదించాలి.

ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి


మార్కెట్ సదుపాయం....

కేటాయించిన సంస్థనే మార్కెట్ సదుపాయం కల్పించి, పంట కొనుగోలు చేసిన 7-8 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయనుంది. మెదక్ జిల్లాకు లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని కేటాయించారు.

తాళాలు పగలగొట్టి.. నగలు ఎత్తుకెళ్లి..

నిజాంపేట, రామాయంపేట: ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన నిజాంపేటలో వెలుగుచూసింది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి వివరాలు.. పంపరి స్వరూప గత నెల 29న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం తిరిగి రాగా.. ఇంటి తాళాలు పగలగొట్టి అర తులం బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. రేగుల ఎల్లవ్వ ఇంట్లో రెండు తులాల బంగారు కమ్మలు, 20 తులాల వెండి ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు.

జాతిపిత.. స్ఫూర్తిప్రదాత



బాపు మాట: మహిళ అర్ధరాత్రి ఒంటరిగా తిరిగినప్పుడే అసలైన స్వాతంత్ర్యం.

మహిళలకు సమాన అవకాశాలు ఉండాలి. అన్నింటా రాణించాలి. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నది జాతిపిత అభిమతం.

సాధికారత దిశగా..




అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు సాధికారత దిశగా పయనిస్తున్నారు. ఉన్నత విద్యపై ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో సమాజం వారికి అండగా నిలవాలి. కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. నాలుగు జిల్లాల్లో మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. మెదక్‌లో 11,833, సంగారెడ్డిలో 16,477, సిద్దిపేటలో 16,773, వికారాబాద్‌లో 12,597 సంఘాలున్నాయి.

బాపు మాట: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు

గ్రామస్వరాజ్యం బాపూజీ కన్న కల. పల్లెలు అన్నింటా రాణిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. స్వరాజ్యం సాధనకు గ్రామస్థులు సంఘటితంగా ముందుకు సాగాలి.

ప్రణాళికాబద్ధంగా..



గాంధీజీ స్ఫూర్తిగా జహీరాబాద్ మండలం తూంకుంట గ్రామస్థులు స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారు. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. దారులకు ఇరువైపులా పూల మొక్కలు నాటి సంరక్షించగా పచ్చదనం అలరిస్తోంది. ఈ-పంచాయతీ నిర్వహణ, ఇంటింటికీ తాగునీరు, తడి, పొడి చెత్త సేకరణ, జనన, మరణ, వివాహ నమోదు సహా ధ్రువపత్రాల జారీ, వీధి దీపాలు, మురుగు కాల్వలు, పచ్చదనం, పరిశుభ్రత, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ నిర్వహణలో ముందంజలో నిలిచింది. తద్వారా ఈఏడాది జనవరిలో ఐఎస్‌వో ధ్రువపత్రం దక్కింది.

నేడు గాంధీ జయంతి

సత్యం, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా యావత్ భారతావనిని ఒక్కటి చేసి స్వాతంత్ర్యాన్ని తెచ్చి పెట్టారు. ఈ మాట వినగానే మన కళ్ల ముందు ఓ బక్కపల్చని శరీరం, తెల్ల ధోవతి, భుజాన కండువా గుర్తుకొస్తాయి. ఆయనే మనమంతా మహాత్మా అని పిలుచుకునే గాంధీజీ. సమష్టితత్వంతో తెల్లదొరలను తరిమికొట్టడమే కాక సమాజం మెరుగైన బాటలో నడవాలన్న సంకల్పం, పోరాట పటిమ జాతిపితగా మార్చాయి.. గాంధీయిజం అందరికీ ఓ చక్కటి పాఠం. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్ఫూర్తితో మార్పును కాంక్షిస్తూ ప్రత్యేకత చాటుతున్న తీరుపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

- న్యూస్‌టుడే, సిద్దిపేట, జహీరాబాద్ అర్బన్, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్

గాంధీజీ వాక్కులు

- సత్యం భగవంతుడికన్నా గొప్పది.
- అహింస ఎదుట హింస పటాపంచలు. సత్యం ఎదుట అసత్యం శూన్యం.
- వ్యక్తిత్వం కోల్పోతే వ్యక్తి సర్వస్వం కోల్పోయినట్లే.
- పుస్తకం గొప్పతనం అందులో ఉండే విషయం మీద ఆధారపడదు. అది మనకు అందించే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది.

బాపు మాట: నిన్ను నీవు కనుగొనడానికి మార్గం.. ఇతరుల సేవలో నిన్ను నీవు మరచిపోవడమే.

ఆపన్నులకు సాయం చేయడంలోనే నిన్ను నీవు తెలుసుకుంటావంటారు మహాత్ముడు. దీని స్ఫూర్తిగా ఎంతోమంది పేదలకు, ఆపన్నులకు అండగా నిలిచారు.

ఆత్మహత్యలకు చలించి..

మల్లన్నసాగర్ నిర్మాణంలో ముంపునకు గురైన ఏటిగడ్డకిష్టాపూర్ చెందిన పులి రాజు ప్రస్తుతం వర్గల్ మండలం తునికి ఖల్సా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2000లో రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతల బలవన్మరణాలు చూసి రైతుల కుటుంబాలను చూసి చలించారు. ఇప్పటివరకు 3 వేల బాధిత కుటుంబాలకు సాయం అందించారు. దాతల సహకారంతో పిల్లల చదివిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న రాజు

బాపు మాట: కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోగలం.

సాధన లేకుండా విజయాన్ని సొంతం చేసుకోలేం. లక్ష్య సాధనకు కఠోర శ్రమ తప్పనిసరి. ఉన్నతమైన ఆలోచనలు నిర్దేశించుకోవాలన్నది గాంధీ సూచన.

ప్రతిభ చాటేలా..



జనాభాలో గరిష్ఠ భాగం యువతదే. వారంతా చదవే లక్ష్యంగా కాకుండా క్రీడలు, వ్యాయామం, శిక్షణలపై దృష్టి సారించాలి. ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రతిభ చాటుకోవాలి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో యువత సంఖ్య 15 లక్షలకు పైనే. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో నాలుగు జిల్లాలకు చెందిన 302 మంది ప్రతిభ చాటడం విశేషం. మెదక్‌కు చెందిన యూత్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు విపత్కర పరిస్థితుల్లో ఇతరులకు సేవ అందిస్తున్నారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 200 మందితో 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించగా ఇలా స్పందించారు.

ఎలాంటి చర్యలతో గ్రామాల ప్రగతి సాధ్యం?

ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి	111
ప్రజలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేయాలి	89

మహిళలకు ఎలాంటి ప్రోత్సాహం అవసరం?

వివక్షకు వ్యతిరేకంగా స్వేచ్ఛను కల్పించాలి	137
నచ్చిన రంగంలో ప్రగతి సాధించేలా వెన్నుతట్టాలి	63

మహాత్ముడి బోధనలు అనుసరిస్తున్నారా?

అవును	64
కాదు	136



గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా హరిత పత్రంపై కిన్నెర అంజయ్య గీసిన చిత్రాలు - న్యూస్‌టుడే, సిద్దిపేట

నాట్యం.. జనరంజకం



కోయ నృత్యం



ఎల్లమ్మ నాటక ప్రదర్శన



సిద్దిపేట విపంచి కళానిలయం వేదికపై విద్యార్థుల ప్రజ్ఞ.. ఆహూతులను అలరించింది. జానపద, శాస్త్రీయ, సంప్రదాయ నృత్యాలతో యువజనోత్సవాలను విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఈ సందడి మంగళవారం యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది.

- న్యూస్‌టుడే, సిద్దిపేట

ఉత్తమ సేవలకు గుర్తింపు



దిల్లీ వెళ్లిన వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, కార్మికులు, స్వయం సహాయక సంఘం సభ్యులు

హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు బోనగిరి లక్ష్మణ్ అందించిన ఉత్తమ సేవలకు తగిన గుర్తింపు లభించింది. ఈ నెల 2న దిల్లీలో జరిగే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ముగింపు సభలో పాల్గొనే అరుదైన అవకాశం దక్కింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సత్కరించనుండటం విశేషం. లక్ష్మణ్ గ్రామ పంచాయతీ మల్టిపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆర్‌ఎంపీగా పని చేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, పలు కారణాలతో పంచాయతీ కార్మికుడిగా చేరారు. ఏ పనైనా నిబద్ధతతో చేయడమే ఇతడికున్న అలవాటు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచేందుకు తోటి కార్మికులతో కలిసి శ్రమిస్తుంటారు. ఈయన సేవలకు పలు సేవా సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవార్డులు అందించడంతో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ క్రమంలో గత నెల 17 నుంచి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా ముగింపు సమావేశం బుధవారం (2న) దిల్లీలో జరుగనుంది. గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని ఎంపిక చేసి దీనికి ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి మొత్తం 10 మంది ఎంపికయ్యారు. గ్రామ పంచాయతీ కార్మిక విభాగంలో లక్ష్మణ్ చోటు దక్కించుకోవం విశేషం. కేంద్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం మేరకు మంగళవారం దిల్లీకి బయల్దేరారు.



లక్ష్మణ్

- న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

గుడి కట్టి.. అభిమానం చాటి..



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామస్థులు మహాత్ముడికి ఆలయం నిర్మించి పూజిస్తుండటం విశేషం. ఐదు దశాబ్దాల క్రితం జాతిపిత ప్రతిమ ఏర్పాటు చేశారు. ఆలయాల్లో మాదిరిగా మహాత్ముడి విగ్రహం ఎదుట నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, మొహర్రం వంటి పండగల వేళ గాంధీజీకి పూజలు చేసి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. 1995లో దివంగత ఎమ్మెల్యే నర్సింహా రెడ్డి, అప్పటి సర్పంచి పీకే పాటిల్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన చేశారు. మహాత్ముడికి జయంతి, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను ఇక్కడే చేపడతారు. - న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

1973లో నెలకొల్పి..




మహాత్ముడు చూపిన బాటలో సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో గాంధీ విగ్రహం నెలకొల్పి పూజిస్తుండటం విశేషం. 1973లో అప్పటి సర్పంచి వెంకట్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే పి.రామచంద్రారెడ్డిలు కలిసి ప్రతిమ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి స్థానికుడు మహాలింగం ప్రతి శుక్రవారం పూజలు చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చిన్న కుమారుడు అడివయ్య స్వామి కొనసాగిస్తున్నారు. గాంధీ జయంతి రోజున ప్రత్యేక పూజలతో పాటు క్షీరాభిషేకం చేసి జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. అనంతరం గ్రామ సభ నిర్వహిస్తారు. - న్యూస్‌టుడే, కొండాపూర్

అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ ఆరా

చేర్యాల, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో జరిగిన అత్యాచార ఘటనపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆరా తీశారు. ఈ మేరకు గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి కైలాస్ నాగేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట సీపీ అనూరాధతో గవర్నర్ మాట్లాడి.. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత బాలికకు పునరావాసం కల్పించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



అంజిలయ్య

కొడంగల్, బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: బొంరాస్‌పేట మండలంలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామస్థులు, ఎస్సై రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం అంజిలయ్య (34) రోజు మాదిరిగానే ఉదయం వరిపొలం చూసేందుకు వెళ్లాడు. పొలానికి చుట్టిన తీగపై విద్యుత్తు తీగ పడి ఉండటం గమనించకుండా వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సంగెం లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో యువకుడు..



నర్సింలు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై పాండు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు(28) శివారులోని సామిల్‌లో పనిచేస్తున్నాడు. ఆయన చరవాణిలో మాట్లాడుకుంటూ సామిల్ సమీపంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నియంత్రిక ఎర్తింగ్ తీగకు కాలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి దుర్మరణం

వర్గల్, న్యూస్‌టుడే: వెనుకనుంచి వచ్చిన వాహనం ఢీకొని చిరువ్యాపారి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గిర్మాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ములుగు మండలం తునికిబొల్లారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన పూసల కృష్ణ (50) ద్విచక్ర వాహనంపై అప్పడాలు, మసాలాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిర్మాపూర్ గ్రామం నుంచి వెళుతుండగా వెనుకనించి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఎగిరి రోడ్డుపై పడిన కృష్ణ తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. అతడి భార్య పుష్పమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాచరణ.. విజ్ఞాన బాట

ఫోన్లకు దూరం సుమా..



విద్యాసంస్థలు కొనసాగినన్ని రోజులు విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చదువు, హోం వర్క్, సన్నద్ధతతో హడావుడిగా గడిపారు. కాస్త సమయం దొరికితే స్మార్ట్ చరవాణి చూసేవారు. ప్రస్తుత సెలవుల్లో అపరిమితంగా అవకాశం ఇవ్వొద్దు. ఫలితంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కొందరు గంటల కొద్ది చూస్తుంటారు. వారిని కాస్త కట్టడి చేయాలి. ఇతర అంశాలపై దృష్టి మరల్చాలి.

జిల్లాల వారీగా విద్యార్థులు (లక్షల్లో)

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
1.74	1.09	2.79	1.20

ప్రణాళికతో సెలవుల్లో వెలుగులు

సమయం వెలకట్టలేనిది. ప్రతి క్షణం ఉన్నతులుగా ఎదిగేందుకు దోహదం చేస్తుంది. విద్యాసంస్థలకు నేటి నుంచి ఈ నెల 14 వరకు ప్రభుత్వం బతుకమ్మ, దసరా సెలవులు ప్రకటించిన విషయం విదితమే. 13 రోజుల పాటు ఇచ్చిన పండగ సెలవులను వినోదంతో పాటు విజ్ఞానమయంగా మార్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి అర్బన్, వికారాబాద్ కలెక్టరేట్

చెంతనే పర్యాటకం..



కొందరు దర్శనీయ ప్రాంతాలకు సుదూరం వెళ్తుంటారు. కాస్త ఉపాయంగా ఆలోచిస్తే చెంతనే పర్యాటక ప్రదేశాలెన్నో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కోమటిచెరువు, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, నాగులబండ వద్ద అర్బన్ ఫారెస్టు, మెదక్‌లో ప్రఖ్యాత చర్చి, గోల్‌బంగ్లా, సంగారెడ్డి జిల్లాలో మంజీర నది, మ్యూజియం, వికారాబాద్‌లో అనంతగిరి అడవులు ప్రత్యేకం. ఆయాచోట్లకు వెళ్తే వినోదం, విజ్ఞానం పంచేందుకు దోహదం చేసినట్లే.

పర్యాటకులు ఇలా..

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
10,000	4,500	3,100	2000

గౌరవం పెంచుదాం..



సెలవుల్లో కుటుంబ సభ్యులు తమ నేపథ్యాన్ని చెప్పాలి. ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరామనే విషయాన్ని వివరించాలి. పరస్పరం గౌరవించే విధానం అలవర్చాలి. ఊర్లకు పంపిస్తారు కనుక పెద్దలను గౌరవించడం నేర్పించాలి. రోజులో కొంత సమయాన్ని కేటాయించాలి. కలిసి భోజనం చేయడం, సరదాగా, స్నేహపూర్వక వాతావరణంలో మెలుగుతూ.. హిత వచనాలు వల్లెవేయాలి.

ప్రోత్సాహంతో ఉత్సాహం..



పిల్లలకు ఆసక్తి ఉన్న ఆటపాటలతో పాటు నచ్చిన కళల వైపు ప్రేరేపించేందుకు మంచి సమయంగా భావించాలి. చిత్రలేఖనం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం, వాద్యం, ఇతర అంశాలనే నేర్చుకునే అవకాశం కల్పించవచ్చు. ఫలితంగా పట్టు సాధించవచ్చు.

పుస్తకం వైపు మరలేలా..



మారుతున్న పరిస్థితుల్లో పుస్తక పఠనానికి దూరమవుతున్నారు. అత్యధికులు ఆన్‌లైన్ మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా ఎనలేని విజ్ఞానాన్ని ఆర్జించవచ్చు. ఇక్కడ చదివిన ఎంతో మంది గొప్ప వ్యక్తులుగా ఎదిగారు. ఈ క్రమంలో ప్రతి జిల్లాలో చెంతనే ఉండే విజ్ఞాన భాండాగారాలను వినియోగించుకోవచ్చు. పుస్తకాలు, నిఘంటువులు, పత్రికలు అందుబాటులో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలి.

గ్రంథాలయాలు

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
21	16	33	20

సంస్కృతి నేర్పిస్తే..



ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల ప్రభావం ఎంతో ఉండేది. చిన్నా పెద్ద అంతా కలిసి ఉండే వారు. సెలవుల్లో అమ్మమ్మ, నాయనమ్మ ఇళ్లకు వెళ్లడం పరిపాటి. ఇదే అదునుగా సెలవులను సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే వేదికగా మార్చుకోవాలి. పండగ విశిష్టతను తెలియజేయాలి.

జిల్లాల వారీగా కుటుంబాలు (లక్షల్లో)

సిద్దిపేట	మెదక్	సంగారెడ్డి	వికారాబాద్
2.38	2.14	3.29	1.98

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ రాములు, పీఈటీ అనిల్‌కుమార్

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ మైనార్టీ బాలుర గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాములు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి ఖోఖో అండర్-14, 17 సహా ఫుట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్ బాల్ అండర్-17 విభాగాల్లో విద్యార్థులు రాహుల్, మల్లేశం, అర్మాన్, అఖిల్, మునీర్, షాహిద్ ఎంపిక కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. క్రీడల్లో సత్తా చాటేలా శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ప్రశాంత్ గౌడ్, పీఈటీ అనిల్‌కుమార్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

సదాశివపేట, న్యూస్‌టుడే: హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ సెషన్ న్యాయమూర్తి భవానీ చంద్ర మంగళవారం తీర్పు వెలువరించారని సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. 'వికారాబాద్ జిల్లా జాంబపూర్ తండాకు చెందిన కాట్రోత్ రవినాయక్ తన మొదటి భార్య చనిపోవడంతో రెండవ భార్యతో కలిసి సదాశివపేట మండలం ఆత్మకూర్‌లో నివాసం ఉంటున్నారు. మొదటి భార్య కూతురు రేణుక వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కస్తూర్బాలో 8వ తరగతి చదువుతోంది. 2020 సంవత్సరంలో కూతురు ఆరోగ్యం బాగా లేదని చికిత్స నిమిత్తం పాఠశాల నుంచి సదాశివపేటకు తీసుకొచ్చాడు. తిరిగి పాఠశాలకు తీసు కెళ్లేటప్పుడు మార్గమధ్యలో గొంతు నులిపి చంపేసి జ్వరంతో చనిపోయిందని అందరిని నమ్మించాడు. అనుమానం వచ్చి అప్పటి వీఆర్వో పోలీసులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ. 500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని' సీఐ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



నర్సింలు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మద్యం మత్తులో భర్త ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం కౌడిపల్లి మండలం సదాశివపల్లి గ్రామ పంచాయతీ పాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాదే నర్సింలు(35), మౌనిక దంపతులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. భార్య ఎనిమిది నెలల క్రితం కుటుంబ కలహాలతో పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపం చెందిన నర్సింలు మద్యం మత్తులో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబీకులు వచ్చి చూసేసరికి మృతిచెందాడు. మృతుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. నర్సింలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మోసం చేసిన స్థిరాస్తి సంస్థ

సాయిసూర్య డెవలపర్స్ ఎండీపై కేసు

ఈనాడు, హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడితో ప్రచారం చేయించి, భారీ వెంచర్లు ప్రారంభిస్తున్నామని ఆర్భాటం చేసిన హైదరాబాద్‌లోని సాయిసూర్య డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.3.63 కోట్లు వసూలు చేసి వినియోగదారుడిని మోసగించింది. నగర శివారులోని మన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ పేరుతో మొదలుపెట్టిన ప్రాజెక్టులో ప్లాట్లు రిజిస్టర్ చేయిస్తామంటూ నమ్మించి వంచించింది. మంగళవారం బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జూబ్లీహిల్స్‌కు చెందిన అచ్యుతసింగ్ నైజీరియాలో వ్యాపారం చేస్తున్నాడు. సాయిసూర్య డెవలపర్స్ సంస్థ ప్రాజెక్టుల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఆకర్షితుడయ్యాడు. 2021 నవంబరులో సంస్థ ఏజెంట్ కరీమ్‌ను సంప్రదించగా, హైదరాబాద్ శివారు, వికారాబాద్‌లో ప్రాజెక్టులు ప్రారంభిస్తోందని వివరించాడు. అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఎండీ సతీశ్ చంద్ర గుప్తాను కలిశారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మాన్సాన్‌పల్లిలో నేచర్ కౌంటీ ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు ఎండీ వివరించాడు. తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అచ్యుతసింగ్ సర్వే నం.32లో 1230, 900 చదరపు గజాల చొప్పున రెండు స్థలాలను రూ.3.63 కోట్లకు కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నాడు. 2022 జనవరి తొలివారంలో రిజిస్ట్రేషన్‌కు అంగీకారం కుదుర్చుకున్నారు. గడువులోగా రిజిస్టర్ చేయిస్తామని చెప్పడంతో అచ్యుతసింగ్ మొత్తం నగదు చెల్లించాడు. 2022 జనవరి 7న రిజిస్ట్రేషన్ చేయిస్తానని సతీశ్‌చంద్ర చెప్పడంతో. అచ్యుతసింగ్, ఆయన కూతురు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. సతీశ్ రాకపోవడంతో అచ్యుతసింగ్ గచ్చిబౌలిలోని కార్యాలయానికి వెళ్లగా, సతీశ్ చంద్ర నెల్లూరు వెళ్లినట్లు సిబ్బంది చెప్పారు. సతీశ్ చంద్ర కాలయాపన చేయడంతో, బాధితుడు సంస్థ గురించి ఆరా తీయగా మరింత మందిని మోసం చేశారని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. సతీశ్‌చంద్ర, కరీమ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని వివరించారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము కాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్‌నం.040- 23551235, 23550967లను సంప్రదించవచ్చని సూచించారు.

బీఆర్ఏఓయూలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 15 వరకు గడువు పొడిగించినట్లు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ద్వారా వివిధ పీజీ, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈ నెల 15 చివరి తేది అన్నారు. మరిన్ని వివరాలకు 73829-29698 చరవాణిలో సంప్రదించాలన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమంలో భాగంగా మెదక్ పురపాలిక కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి పట్టణ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు పార్థసారథి పారిశుద్ధ్య విభాగం, నీటి సరఫరా తదితర శాఖలకు చెందిన కార్మికులకు పలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. మెదక్ పురపాలిక డీఈఈ మహేశ్, హెల్త్ అసిస్టెంట్ మహేశ్, పర్యావరణ ఇంజినీర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నిర్వహణ అస్తవ్యస్తం.. ఆదాయానికి గండి

న్యూస్‌టుడే, నర్సాపూర్: నర్సాపూర్ పట్టణం వెల్దుర్తి వెళ్లే మార్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నిర్మించారు. ఈ ఆవరణలో నిర్మించిన దుకాణ సముదాయం ఏడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో ఏఎంసీ ఆదాయానికి భారీగా గండిపడుతున్నా ఆ శాఖ అధికారుల్లో మాత్రం చలనం లేదు. కొత్త దుకాణాలను ప్రారంభించి రెండేళ్లు దాటినా నిరుపయోగంగా ఉంటున్నాయి. అంతే కాకుండా పాత దుకాణ సముదాయం సైతం ఖాళీగా ఉంచుతున్నారు. సంబంధింత అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని దుకాణాలను వినియోగంలోకి తెచ్చేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

14 దుకాణాలు వృథాగా: నర్సాపూర్ వ్యవసాయ విపణి ఆదాయం పెంచే క్రమంలో రూ.81లక్షలు వ్యయంతో పది దుకాణాలు నిర్మించారు. గతంలో పాలకవర్గం గడువు ముగుస్తుండగా వారి హయాంలో దుకాణ సముదాయం పూర్తయినట్లుగా ఉంటుందని 2022 నవంబరు 19న అప్పటి మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా హడావిడిగా ప్రారంభించారు. ఆ సమయంలో చిన్నచిన్న పనులు మిగిలిపోయిన తర్వాత పూర్తిచేశారు. దుకాణ సముదాయం ప్రారంభించాక కొన్ని నెలలపాటు వాటిని వృథాగా ఉంచారు. దీనిపై అడిగితే కొసరు పనులు పూర్తిచేయాల్సి ఉందని, గుత్తేదారు నిర్లక్ష్యం అంటూ నెట్టుకొచ్చారు. ఏడాది క్రితం



ఏఎంసీ దుకాణ సముదాయం

చిన్న పనులు సైతం గుత్తేదారు పూర్తి చేశారు. నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినా వినియోగంలోకి మాత్రం తేవడం లేదు. తద్వారా ఏఎంసీ ఆదాయానికి నెలకు రూ.50వేల వరకూ గండి పడుతుంది. ఒక్కో దుకాణానికి రూ.5వేల చొప్పున అద్దెగా ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదికి కనీసం రూ.6లక్షల వరకూ ఏఎంసీ నష్టపోయింది. వ్యాపారాల నిర్వహణకు ఎంతో మంది ఆసక్తి చూపుతున్నారు. కొందరు వ్యాపారులు నేరుగా కార్యాలయానికి వచ్చి దుకాణాల అద్దె కోసం దరఖాస్తు చేసుకున్నారు.



పొదల మాటున పాత దుకాణ సముదాయం..

పాతవి నిరుపయోగంగా: ఏఎంసీ ఆవరణలో గతంలో నిర్మించిన 8 దుకాణాల సముదాయం కూడా ఉంది. వీటిల్లో నాలుగు దుకాణాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. వీటి వద్ద పొదలు పెరిగినా పట్టించుకోవడం లేదు. మిగతా నాలుగు దుకాణాల పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దుకాణ సముదాయం నిర్మాణానికి కరెంటు తీగలు అడ్డు వస్తున్నాయని గుత్తేదారు పనులు మధ్యలో ఆపేశారు. తీగలు తొలగించినా పనులు మాత్రం ఇంకా ప్రారంభించడం లేదు.

త్వరలో టెండరు ప్రక్రియ చేపడతాం: ప్రతాప్‌గౌడ్, ఏఎంసీ కార్యదర్శి, నర్సాపూర్

దుకాణ సముదాయాన్ని అద్దెకు ఇచ్చేందుకు వీలైనంత త్వరలో టెండరు ప్రక్రియ పూర్తి చేస్తాం. ఏడాది క్రితం గుత్తేదారు చిన్నచిన్న పనులు పూర్తిచేసి స్వాధీనం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించి, దుకాణం అద్దె రూ.3500ల చొప్పున నిర్ణయించాం. అంతకంటే ఎక్కువ చెల్లించిన వారికి దుకాణాలు అద్దెకు ఇస్తాం. పాత వాటిలో ఖాళీగా ఉన్న దుకాణాలను సైతం అద్దెకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

న్యూస్‌టుడే, టేక్మాల్: ? టేక్మాల్ మండలం హసన్‌మహ్మద్‌పల్లి శివారు పొలాల్లో స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. - దుర్గయ్య, స్థానికుడు

✓ సమస్య మా దృష్టికి రాలేదు. ప్రస్తుతం పంటలు సాగు వల్ల కొత్త స్తంభాలు ఏర్పాటుకు అవకాశం లేదు. పంటలు పూర్తయిన తర్వాత సమస్య పరిష్కరిస్తాం. - ఉదయ భాస్కర్, ట్రాన్స్‌కో ఏఈ, టేక్మాల్

గోడకూలి వ్యక్తి మృతి

తూప్రాన్, న్యూస్‌టుడే: శౌచాలయంలో మరమ్మతులు చేస్తుండగా గోడ కూలి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మల్కాపూర్‌లో జరిగింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన కొంతం నర్సింలు(58) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం తన ఇంటి ముందు శౌచాలయంలో నీటి సరఫరా లేక మరమ్మతులు చేసేందుకు ఉపక్రమించాడు. ప్రమాదవశాత్తు గోడమీద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

తూప్రాన్, న్యూస్‌టుడే: నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలను చోరీ చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..వెల్దుర్తి మండలం హస్తల్‌పూర్‌కు చెందిన బత్తుల శ్రీను గత కొంతకాలంగా ద్విచక్రవాహనాలను చోరీ చేస్తూ జల్సాలు చేస్తున్నాడు. తూప్రాన్‌లో 2, బోయినపల్లిలో 1, హైదరాబాద్‌లో 2 ద్విచక్రవాహనాలను చోరీ చేశారు. తూప్రాన్‌లో చోరీకి గురైన విషయంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అనుమానాస్పందగా ద్విచక్రవాహనంపై తిరుగుతున్న శ్రీనును పోలీసులు పట్టుకొని విచారించారు. దీంతో చోరీ విషయాలను అంగీకరించారు. అతని వద్ద నుంచి 5 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

గ్రామాల్లో ముమ్మర తనిఖీలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలంలో మత్తులో జరిగిన హత్య, దాడుల నేపథ్యంలో మంగళవారం రాత్రి పోలీసుల బృందాలు ముమ్మర తనిఖీ నిర్వహించారు. పెద్దగొట్టిముక్క, గోమారం గ్రామాల పరిధిలో వాహనాలు, పలు దుకాణాలు తనిఖీ చేశారు. గోమారంలో భిక్షాటన చేసే గుర్తుతెలియని వ్యక్తిని చిత్రహింసలు పెట్టి హత్య చేయడం, పెద్దగొట్టిముక్కలో నలుగురిపై దాడి ఘటనలు జరిగాయి. తూప్రాన్ సీఐ, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది బృందాలుగా వెళ్లి తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. పెద్దగొట్టిముక్కలో జరిగిన దాడి ఘటనపై గాయపడిన వారి ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దగొట్టిముక్కలో కోతుల దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బాలేష్ ఇంటి వద్ద ఉండగా మంగళవారం కోతులు దాడి చేశాయి. చేతికి గాయం కావడంతో శివంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ప్రతి రోజూ కోతుల దాడిలో గాయపడిన వారు చికిత్స చేయించుకునేందు వస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

స్వగ్రామానికి చేరిన వస్‌రామ్ మృతదేహం

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: మండల పరిధి సుల్తాన్‌పూర్ తండాకు చెందిన రమావత్ వస్‌రామ్ (40) గత నెల 10న దుబాయిలో మృతిచెందారు. మంగళవారం మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి సుల్తాన్పూర్ తండాకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య అనిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వృద్ధులను గౌరవించి, ఆదరించాలి

నర్సాపూర్, టేక్మాల్, న్యూస్‌టుడే: జీవిత చరమాంకంలో వృద్ధాశ్రమంలో ఉంటూ కాలం వెళ్లదీస్తున్న పండుటాకులను ఆదరించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. నర్సాపూర్ విజన్ వృద్ధాశ్రమంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. పురాధ్యక్షుడు అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావు, ఎంపీడీవో మధులత, కౌన్సిలర్ బుచ్చేశ్‌యాదవ్, నిర్వాహకురాలు అభర్ణరెడ్డి పాల్గొన్నారు. వృద్ధాశ్రమానికి ప్రభుత్వ భూమి కేటాయించడానికి పరిశీలిస్తానని తహసీల్దార్ తెలిపారు. బగిలీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులను ఫౌండర్ నర్సింగ్‌సాగర్ పంపిణీ చేశారు. టేక్మాల్ మండలం బర్ధీపూర్‌లో యువజన సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తల్లిదండ్రులతో పాటు స్థానిక వృద్ధులకు పువ్వులు అందించారు.



నర్సాపూర్‌లో వృద్ధులను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, పుర అధ్యక్షులు

అసత్య ఆరోపణలు తగదు

తూప్రాన్, న్యూస్‌టుడే: పురపాలిక మాజీ ఛైర్మన్ బొంది రవీందర్‌గౌడ్ తనను అవమానకరంగా మాట్లాడడం తగదని పుర ఛైర్‌పర్సన్ జ్యోతికృష్ణ అన్నారు. మంగళవారం పురపాలిక కార్యాలయంలో వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశం ఆమె మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన తనను అక్రమంగా ఎన్నికయ్యారని, ఏకవచనంతో మాట్లాడడంపై పరువునష్టం దావా వేస్తానన్నారు. భారాస హయాంలోనే పన్నుల పెంపు జరిగిందన్నారు. అసత్య ఆరోపణలు మానుకొని కౌన్సిల్ సమావేశానికి నిర్ణీత సమాయానికి రావాలన్నారు. కౌన్సిలర్లు భగవాన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు, జ్యోతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురపాలిక ఛైర్‌పర్సన్ జ్యోతికృష్ణ

బతుకమ్మ సంబురం.. విద్యార్థుల ఆనందం



టేక్మాల్ ఆదర్శ పాఠశాలలో..



యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో..



మనోహరాబాద్ ఉన్నత పాఠశాలలో కోలాటం ఆడుతూ..

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి పువ్వులతో బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలకు, కోలాటం ఆడిపాడుతూ సందడి చేశారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. చేగుంట, నిజాంపేట, రామాయంపేట, పెద్దశంకరంపేట, నర్సాపూర్, పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్, వృక్షశాస్త్ర విభాగం సంయుక్తంగా వేడుకలు నిర్వహించారు. పూలచెట్లలో ఉండే ఔషధ గుణాలను విద్యార్థులకు వివరించారు. మెదక్ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మనోహరాబాద్, పాపన్నపేట, టేక్మాల్, వెల్దుర్తి, మాసాయిపేట, చిన్నశంకరంపేట, కొడిపల్లి, రేగోడ్, చిలప్‌చెడ్, శివ్వంపేట మండలాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో..



మెదక్: టీటీడబ్ల్యూఆర్‌డీసీలో బతుకమ్మ ఆడుతూ..



నర్సాపూర్‌లో..

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: పీఆర్టీయూ

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: సమస్యల సాధన, ఆపదలో ఉన్న ఉపాధ్యాయ కుటుంబ సంక్షేమమే లక్ష్యంగా పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, గుండు లక్ష్మణ్ అన్నారు. మండలంలోని గౌతపూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గత నెలలో మృతిచెందాడు. పీఆర్టీయూ సంఘంలో సభ్యత్వం ఉండడంతో రూ.1లక్ష చెక్‌ను మృతుడి భార్యకు చిట్కుల్ తండాలో పరామర్శించి అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్ తదితరులున్నారు.

పారిశుద్ధ్య పరికరాల కొనుగోలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: పురపాలిక పరిధి 15 వార్డులలో పారిశుద్ధ్యం మెరుగు కోసం ఆయా రకాల పరికరాలను కొనుగోలు చేసినట్లు పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తెలిపారు. ఆధునిక గ్రాస్ కటింగ్ యంత్రాలు-2, హ్యాండ్ స్ప్రేలు-3, గుంతలు తవ్వే యంత్రం-1 కొనుగోలు చేయగా మంగళవారం వాటిని ప్రదర్శించారు. మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ రాంచందర్ తదితరులున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

న్యూస్‌టుడే, చేగుంట: మట్టి రోడ్లు అధ్వానంగా మారాయి. ఒక వైపు వర్షాకాలం, మరోవైపు దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడిపించడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీనివల్ల కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా కిందపడిపోయే ప్రమాదం ఉంది. గుంతల్లో నీరు చేరి పూర్తిగా బురదమయంగా మారాయి. చేగుంట, నార్సింగి, మాసాయిపేట మండలాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది.

అధ్వానంగా మారిన రోడ్లతో ఇబ్బందులు



వల్లభాపూర్‌లో పొలాలకు దారి..

కన్నెత్తి చూడని అధికారులు

మట్టి రోడ్లపై ప్రయాణించాలంటే కష్టంగా మారింది. పెద్ద గుంతలు ఏర్పడ్డా వాటిని మాత్రం బాగు చేయటం లేదు. దీనివల్ల పొలాల వద్దకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నార్సింగి మండలం నర్సంపల్లి రోడ్డు నుంచి చేగుంట మండలం వల్లభాపూర్ శివారులో రైతులు పొలాలు, సోలార్ ప్లాంట్ వంటివి ఉన్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారి పూర్తిగా శిథిలమైంది. ఏటా రైతులే బాగు చేసుకుంటున్నారు తప్ప.. అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. వర్షాకాలం పూర్తయిన తర్వాత జేసీబీలు, డోజర్లు పెట్టి గుంతలు పూడ్చి వేసుకుంటున్నారు. ఇక వర్షాకాలంలో కనీసం నడవటానికి కూడా కష్టంగా మారింది. కార్లు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉంది. పొలంపల్లి నుంచి చెరువుతో పాటు రెడ్డిపల్లి కాలనీకి వెళ్లే రోడ్డు కూడా ఇలాగే ఉంది. రోడ్డులో రెండు వైపుల కాల్వల్లా ఏర్పడటంతో వాహనాల్లో వెళ్లాలంటేనే భయంగా ఉంటుంది. ద్విచక్రవాహనాలపై వెళ్తుంటే ఏమాత్రం అదుపు తప్పినా కిందపడిపోవటం ఖాయం.

కంకరతేలి.. గుంతలు ఏర్పడి..

అనంతసాగర్ నుంచి కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వరకు ఉన్న రోడ్డుపై కంకర తేలింది. రాత్రివేళ ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ఈ మార్గంలో కూడా నిత్యం రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజలు, రైతులు దీనిని బాగుచేయాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మక్కరాజుపేట నుంచి గొల్లపల్లి, నార్సింగి నుంచి శాలిపేట, బోనాల నుంచి పిట్టల తండా, ఇబ్రహీంపూర్ నుంచి కిష్టాపూర్, కసాన్‌పల్లి నుంచి మాచిన్‌పల్లి, కసాన్‌పల్లి నుంచి తండా వరకు మట్టి, కంకర దారులు అధ్వానంగా మారాయి. వీటిని బాగుచేసి సమస్య లేకుండా చేయాలని కోరుతున్నారు. మట్టి రోడ్లను బాగు చేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని మెదక్ పీఆర్ ఈఈ నర్సింహులు తెలిపారు.

భారీగా రసాయన వ్యర్థాల దహనం

శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లో రసాయన వ్యర్థాలు విచ్చలవిడిగా పారబోస్తున్నారు. మండలంలోని సికింద్లాపూర్ గ్రామ శివారు కుచారం పరిధిలోని పలు పరిశ్రమలకు సంబంధించిన రసాయన వ్యర్థాలను భారీగా డంపింగ్ చేస్తున్నారు. సికింద్లాపూర్ శివారులోని ఓ వేడుక మందిరం ఆవరణలో విచ్చలవిడిగా రసాయన వ్యర్థాలు దహనం చేయడంతో దుర్వాసన, కాలుష్యం ఏర్పడుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. సికింద్లాపూర్ లక్ష్మీనరసింహా స్వామి ఆలయం వద్ద ఓ వేడుక మందిరంలో వ్యర్థాలు భారీగా డంప్‌చేశారు. నిత్యం లారీ, డీసీఎం వాహనాల్లో వ్యర్థాలను ఇక్కడకు తరలించి తెచ్చి దహనం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజును వివరణ కోరగా..వేడుకల్లో వ్యర్థాలు దహనం చేయడం తమ దృష్టికి వచ్చిందని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. **న్యూస్‌టుడే, శివ్వంపేట**



తాగునీటి సరఫరా సహాయకులకు శిక్షణ

తూప్రాన్, చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు ఉద్యోగులకు సహాయకంగా ఉండేందుకు కొత్తగా నియమించిన సహాయకులకు తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ..తూప్రాన్, మనోహరాబాద్ మండలాలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులపాటు శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎంపీడీవో శేషాద్రి, ఏఈలు మీనా, దివ్య తదితరులున్నారు. చిన్నశంకరంపేట ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులను ఎంపీడీవో దామోదర్ ప్రారంభించారు. ఐదురోజుల పాటు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, శిక్షకుడు శ్రీనివాస్, ఎంపీవో గిరిజ పాల్గొన్నారు.



చిన్నశంకరంపేటలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో దామోదర్

ఇంటింటికి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

కొడిపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రం కొడిపల్లిలో నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో గ్రామానికి చెందిన యువసేన యూత్ అధ్యక్షుడు పోల నవీన్ సొంతంగా ట్యాంకర్ ఏర్పాటు చేసి ఇంటింటికి నీటి సరఫరా చేస్తున్నారు. మంగళవారం సైతం ఇంటింటికి నీటిని ట్యాంకర్ ద్వారా అందించారు. దీంతో గ్రామస్థులు నవీన్ అభినందించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్యను అందించాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ సూచించారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఎంపీసీ, బీజెడ్సీ విభాగాలకు చెందిన ప్రథమ తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను అందించడంలో కళాశాల అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తారన్నారు. అనంతరం ఆయన్ని అధ్యాపకులు బీఎస్సీ విభాగం తరుపున సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ శరత్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ తిరుమల్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులున్నారు.



ప్రిన్సిపల్ హుస్సేన్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

సమస్యల పరిష్కారానికి పోరాటం: ఏబీవీపీ

రామాయంపేట, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పోరాటానికి అండగా ఉంటామని ఏబీవీపీ మెదక్ విభాగ్ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్, మెదక్, సిద్దిపేట జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి అన్నారు. రామాయంపేటలో ఏబీవీపీ నగర నూతన కమిటీ ఏర్పాటు చేశారు. నగర కార్యదర్శిగా భాను, సంయుక్త కార్యదర్శులుగా దీక్షిత్, వంశీ, హరి, పూజ, మహిళా కన్వీనర్‌గా నిఖిత, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్‌గా అర్జున్, సోషల్ మీడియా కన్వీనర్‌గా నవీన్, కళామంచ్ కన్వీనర్‌గా సాత్వికను నియమించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, కార్యకర్తలు నితిన్, నవీన్, రమేష్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

డిజిటల్ సర్వే నుంచి మినహాయించాలని నిరసన

డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏఈవోలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. సర్వే నుంచి ఏఈవోలను మినహాయించాలని చేగుంటలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. చేగుంట, నార్సింగి రైతువేదికల్లో ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచనల ఆధారంగా ఇతర రాష్ట్రాల్లో అమలు తీరును తెలంగాణలో కూడా అమలు చేయాలన్నారు. పెద్దశంకరంపేట మండలంలో నల్లబ్యాడ్జీలు ధరించి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొల్చారం, వెల్దుర్తి, మాసాయిపేట, కౌడిపల్లి, రేగోడ్ మండలాల్లోని ఆయా రైతువేదికల్లో ఏఈవోలు నల్లబ్యాడ్జీలకు ధరించి నిరసన తెలిపారు. - న్యూస్‌టుడే బృందం



చేగుంటలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

రామాయంపేట,: అర్హులైన బీడీ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీపీఎం రామాయంపేట ఏరియా కమిటీ కార్యదర్శి బాలమణి అన్నారు. మంగళవారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ..బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4వేలు అందించాలని, రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. కార్యవర్గ సభ్యుడు బాబు ఉన్నారు.

ఉత్తమ బోధనకు ప్రశంస

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: హవేలిఘనపూర్ ప్రాథమిక పాఠశాలను ఇటీవల ఎస్ఈఆర్టీ డైరెక్టర్ రమేష్ తనిఖీ చేశారు. ఈ క్రమంలో రమేష్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో ఉపాధ్యాయురాలు సుజాతను అభినందించారు. ఆమెకు ప్రశంస పత్రాన్ని అందించాలని డీఈవో రాధాకిషన్‌కు సూచించగా, మంగళవారం ఎంఈవో మధుమోహన్ ప్రశంసా పత్రాన్ని అందించి, అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ ఉన్నారు. ఉన్నారు.